క్లుప్తంగా

ఆర్గానిక్ ఉత్పత్తుల మేళా

మదనపల్లె: స్థానిక సొసైటీకాలనీ రామాలయంలో శనివారం టింబక్ట్ ఆర్గానిక్ ఉత్పత్తుల మేళా ప్రారంభమైంది. నిర్వాహకులు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించి ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు ప్రజల నుంచి స్పందన కనిపించింది. నిర్వాహకులు రాజశేఖర్, శంకర్ మాట్లాడుతూ సత్యసాయిజిల్లాలో రైతులు చిరుధాన్యాల పంటలను సాగుచేస్తున్నారని అన్నారు. ఈ ఉత్పత్తులను ఆహారంగా తీసుకోవడం ద్వారా ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని అన్నారు. ఎన్నో వ్యాధులకు ఈ ఆహారం ఔషధంగా పనిచేస్తుందన్నారు. ధరణి వ్యవసాయ పరస్పర సహకార సంఘం తరపున రెండుజిల్లాల్లోని 10 మండలాల్లోని 80 గ్రామాల్లో 2,666 మంది రైతులతో 14,750 ఎకరాల్లో సేంద్రీయ పంటలు సాగు చేస్తున్నారని అన్నారు. వీటికి మార్కెటింగ్, గిట్టుబాటు ధరలు కల్పిస్తున్నట్లు చెప్పారు.

దాతల సాయం అభినందనీయం

పీలేరురూరల్ : హాస్పిటల్ అభివృద్ధికి సాయం అభినందనీయమని పీలేరు ఏరియా ఆస్పత్రి సూపరింటిండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. శనివారం స్థానిక ఏరియా ఆస్పత్రికి మండలంలోని రేగళ్లు పంచాయతీ కూరపర్తివారిపల్లెకు చెందిన బి. రాజారెడ్డి రూ. 60 వేలు విలువ చేసే 10 బెంచీలు, 10 స్టూల్లు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు నేలమల్లేశ్వరస్వామి ఆలయంలో మండలపూజ

నిమ్మనపల్లె : నేలమల్లేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పునఃప్రతిష్ట మండల పూజ మహోత్సవం జరుగుతుందని ఈఓ మంజుల తెలిపారు. గర్భాలయ పునరుద్ధరణ తర్వాత దేవతామూర్తుల పునఃప్రతిష్ట అనంతరం 40 రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు. పూజా మహోత్సవం ముగింపు సందర్భంగా సోమవారం ఉదయం కళశస్థాపన, మహాగణపతిపూజ, హోమం, పూర్ణాహుతి, శిఖర కళశ కుంభాభిషేకం తదితర కార్యక్రమాలు ఆలయ పూజారి శంకరశర్మ ఆధ్వర్యంలో జరుగుతాయన్నారు. భక్తులు పూజాకార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

పెద్దతిప్పసముద్రం: మండలంలోని పులికల్లులో శనివారం కొత్తగా మంజూరైన స్మార్ట్ రేషన్ కార్డులను తహసీల్దార్ శ్రీరాములు నాయక్, సీఎస్‌డీటీ సుబ్బయ్య, ఆర్‌ఐ చినపరెడ్డిలు లబ్ధిదారులకు అందజేసారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ మండలానికి 16,385 కార్డులు వచ్చాయన్నారు.

పల్లెబాట పట్టిన అధికారులు



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ హరిహరప్రసాద్

పెద్దతిప్పసముద్రం: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ప్రజలను అప్రమత్తం చేసేందుకు అధికారులు, పోలీసులు మండలంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ప్రమాదకరంగా ఉన్న చెరువులు, కుంటల వద్దకు వెళ్ళరాదని, ప్రధానంగా చేపల వేటకు వెళ్ళరాదని, కూలడానికి సిద్ధంగా ఉన్న పురాతన భవనాలు, ఇళ్ళలో నివసించరాదని ప్రజలకు సూచిస్తున్నారు. అంతేగాక పెద్దతిప్పసముద్రం మండలం రెడ్ జోన్‌లో ఉందని వర్ష సమయంలో ప్రజలు చెట్ల కింద ఉండరాదని తహసీల్దార్ శ్రీరాములు నాయక్, ఎస్ఐ హరిహరప్రసాద్‌లు పల్లెబాట పట్టి ప్రజలకు జాగ్రత్తలు తెలియజేస్తున్నారు. ముఖ్యంగా రైతులు లోతట్టు ప్రాంతాల వద్దకు వెళ్లరాదంటున్నారు.

మెగా జాబ్‌మేళాలో 129 మందికి ఉద్యోగాలు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్

మదనపల్లె రూరల్ : మండలంలోని జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో 129 మంది అభ్యర్థులు ఉద్యోగాలు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ జీ.రాజేంద్రప్రసాద్ తెలిపారు. మెగా జాబ్‌మేళాలో సుమారు 15 కంపెనీలకు పైగా పాల్గొన్నాయన్నారు. జాబ్‌మేళాకు 261మందికి పైగా నిరుద్యోగులు హాజరుకాగా, అందులో 129 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. ఉద్యోగాలు పొందిన అభ్యర్థులను ప్రిన్సిపాల్ అభినందించారు. కార్యక్రమంలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా అధికారి నాగార్జున, అదనపు నైపుణ్య అభివృద్ధి అధికారి ఆరీఫ్, జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి వెంకటేష్ గౌడ్, పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

మదనపల్లె సిటీ: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కో ఆర్డినేటర్ మోహన్‌వల్లి అన్నారు. శనివారం స్థానిక బసినికొండ వద్దనున్న నగర వనం వద్ద మొక్కలు నాటారు. మొక్కలు నాటడంతోపాటు వాటిని పరిరక్షించాలన్నారు.

కొత్తపల్లె..వర్షపునీటితో తల్లడిల్లె



కొత్తపల్లి రోడ్డుపై కుంటలా నిలిచిన వర్షపు నీరు



వరిపంటలో నిలిచిన వర్షపు నీటిని చూపుతున్న రైతు

- రాకపోకలకు అవస్థలు
- నీట మునిగి పంటలకు నష్టం

కురబలకోట: మండలంలోని పిచ్చలవాండ్లపల్లి గ్రామం కొత్తపల్లి వాసులు దారి లేక రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పక్కనున్న అప్పాలమ్మచెరువుపై ముదివేడు రిజర్వాయర్‌ను నిర్మించారు. ఇటీవల వరుసుగా కురుస్తున్న వర్షాలకు తోడు ఊట నీరు రోడ్డుపై చేరడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు బురద మయం కావడంతో వాహనాల్లో కూడా వెళ్లలేక సతమతం అవుతున్నారు. ఎర్రదొడ్డి గంగమ్మ గుడి మార్గంలోను కొత్తపల్లె మార్గంలోను రెండు చోట్ల మోకాళ్లలోతు నీళ్లతో రోడ్డుపై రాకపోకలకు పడరాని పాట్లుపడుతున్నారు. మరో దారి లేక ఈ దారిలో రాకపోకలు సాగించలేక అల్లాడుతున్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు బాధిత రైతులు తెలిపారు. అంతేగాకుండా చెరువు నీళ్లతో పరివాహక ప్రాంతాల్లో వరి, టమాటా సాగు దెబ్బతింది. నీళ్లు నిలచిపోవడంతో 10 ఎకరాల దాకా పంటలు దెబ్బతిన్నాయని బాధిత రైతులు చెబుతున్నారు. ఆనందరెడ్డి, రవీంద్రరెడ్డి, కేశవ రెడ్డి, సదాశివ రెడ్డి, కృష్ణారెడ్డి, ఎరుకులరెడ్డి, శివారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వసంత రెడ్డి, రమణారెడ్డి, రెడ్డిశేఖర్ రెడ్డి, శంకర్ రెడ్డి, మోహన్ రెడ్డి, వాసుదేవ రెడ్డి తదితర రైతుల పంటలు దెబ్బతిన్నాయి. వీరు దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. మోటార్లు కూడా మునిగిపోయాయి. వర్షం కోలుకోలేని దెబ్బతీసిందని వ్యథ చెందుతున్నారు.

రోడ్డంతా నీళ్లు..బురదే



రోడ్డు పొడవునా బురద మయంగా మారింది. దీనికి తోడు రోడ్డుపై మోకాళ్లలోతు నీళ్లు నిలచిపోయాయి. మహిళలు, విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.అందరూ నీళ్లను దాటుకుని వెళ్లాల్సి వస్తోంది. ఒక వైపు రోడ్డుపై నీళ్లు చేరడం మరో వైపు పంటలు దెబ్బతినడంతో దెబ్బమీద దెబ్బ తగిలింది. చెమటతో సాగు చేసిన పంటలు దెబ్బతిని పెట్టుబడులు నీట మునిగాయి. ఒక వైపు రోడ్డుపై నీళ్లు మరో వైపు పంటలు నీట మునిగి కన్నీళ్లలా మాపరిస్థితి మారింది. **-కేశవరెడ్డి, కొత్తపల్లి, కురబలకోట**

కుల వివక్ష చూపితే చర్యలు తప్పవు



మాట్లాడుతున్న తహసీల్దార్ నరేంద్రకుమార్

కేవీపల్లె : సమాజంలో కుల వివక్ష చూపితే చర్యలు తప్పవని తహసీల్దార్ నరేంద్రకుమార్ అన్నారు. శనివారం మండలంలోని నూతనకాలువ పంచాయతీ దోర్నాదులపల్లెలో పౌరహక్కుల దినోత్సవ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న సమస్యల గురించి ఏపీ ఎమ్మార్పీఎస్ ఉమ్మడి చిత్తూరు జిల్లా కన్వీర్ ముల్లంగి చంద్రయ్య అధికారుల దృష్టికి తెచ్చారు. స్థానికంగా సంఘమిత్ర డ్వాక్రా డబ్బులు మోసం చేశారని తెలిపారు. గ్రామంలో విద్యుత్ వీధి దీపాలు సమస్య, వాటర్ ట్యాంకు లీకేజీ సమస్య, రోడ్డు సమస్య గూర్చి అధికారులకు తెలిపారు. గ్రామంలో చాలా వరకు ఇళ్లు ఉరుస్తున్నాయని, ఆ స్థానంలో కొత్తగా ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. నూతనకాలువలో ఓ హోటల్‌లో కులవివక్షత చూపుతున్నట్లు అధికారులకు తెలిపారు. దీంతో అధికారులు ఆ హోటల్‌ను సందర్శించారు. అన్ని వర్గాలకు భోజనం వడ్డించాలని ఆదేశించారు. హోటల్ యజమానికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఎవరైనా కుల వివక్షత చూపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్సీ, ఎస్టీ గ్రామాల అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు. తమ దృష్టికి తెచ్చిన సమస్యలు పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఎంపీడీఓ సుధాకర్, ఎస్ఐ చిన్నరెడ్డెప్ప, ఏపీవో నాగరాజు, ఏపీఎం అనురాధ, హౌసింగ్ ఏఈ హరిబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మధు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పోషణ ఆరోగ్యానికి పునాది

కురబలకోట: పోషణ మాసం వేడుకలు శనివారం కనసానివారిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో సీడీపీఓ సుజాత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు పౌష్టిక ఆహారం తీసుకోవడం వల్ల ఎర్ర రక్తకణాలు ఎక్కువగా ఉంటాయన్నారు. ఆరోగ్యానికి పునాదిగా మారుతుందన్నారు. పిల్లలు అధిక బరువు కాకుండా చూడాలన్నారు. సమతుల ఆహారం వల్ల పిల్లలు ఆరోగ్యకరంగా ఉంటారన్నారు. అంగన్‌వాడీ టీచర్ రాధిక పాల్గొన్నారు.

శ్రీ నారసింహుడికి పూజలు

గుర్రంకొండ: మండలంలోని గుర్రంకొండ, తరిగొండ గ్రామాల్లో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయాల్లో స్వామివార్లకు విశేష పూజలు నిర్వహించారు. శనివారం టీటీడీ వారి ఆధ్వర్యంలో తరిగొండ ఆలయంలో స్వామివార్లకు వేకువజామునే స్వామివారికి పలు రకాల నైవేద్యాలు సమర్పించి అభిషేకాలు, అర్చనలు చేశారు. తోమాల సేవ, ఏకాంతసేవ కావించారు. ఈసందర్భంగా స్వామివారిని రంగురంగుల పుష్పాలతో అందంగా అలంకరించారు. చారిత్రాత్మక గుర్రంకొండ కోటలోని శ్రీ నృసింహస్వామి ఆలయంలో వేకువజామేన అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయాలకు చేరుకొని స్వామివార్లను సేవించుకొన్నారు. అర్చకులు భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీటీడీ అధికారులు, ఆలయఅర్చకులు పాల్గొన్నారు.

రెండోరోజు దస్తావేజు లేఖరుల పెన్‌డౌన్

- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట అర్ధనగ్న ప్రదర్శన
- నూతన విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్



అర్ధనగ్నప్రదర్శనతో నిరసన తెలుపుతున్న దస్తావేజు లేఖరులు

మదనపల్లె రూరల్ : రిజిస్ట్రేషన్‌శాఖలో ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన డేటాబేస్ రిజిస్ట్రేషన్ల విధానాన్ని రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ దస్తావేజు లేఖరులు నిర్వహిస్తున్న పెన్‌డౌన్ శనివారంకు రెండోరోజుకు చేరుకుంది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట దస్తావేజు లేఖరులు పెన్‌డౌన్‌లో భాగంగా రాష్ట్ర దస్తావేజు లేఖర్ల సంక్షేమ సంఘం పిలుపుమేరకు అర్ధనగన్న ప్రదర్శనతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏపీ దస్తావేజు లేఖరుల సంఘం కార్యదర్శి కంగేరినందా మాట్లాడుతూ..నూతన విధానంలో రిజిస్ట్రేషన్ చేసేటప్పుడు క్రయ,విక్రయదారులకు సంబంధించి పబ్లిక్ డేటా ఎంట్రీ చేసే సమయంలో వన్‌టైమ్ పాస్‌వర్డ్(ఓటీపీ) అడుగుతోందని, దీనివల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆధార్‌కార్డు నెంబర్లు, ఓటీపీలు ఎవరికీ చెప్పవద్దని బ్యాంకు అధికారులు, పోలీసు, రెవెన్యూ అధికారులు తెలియజేస్తున్న నేపథ్యంలో రిజిస్ట్రేషన్‌శాఖలో ఓటీపీ పద్ధతిని రద్దుచేయాలన్నారు. ఆన్‌లైన్ డేటా సబ్‌మిట్‌లో ఓటీపీలతో సంబంధం లేకుండా మాన్యువల్‌గా నిర్వహించేలా చూడాలన్నారు. రాష్ట్రప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన డేటాబేస్ రిజిస్ట్రేషన్ల విధానంలో మార్పులు చేయాలని డిమాండ్ చేశారు. డేటా ఎంట్రీలో జరిగిన తప్పులకు సవరణ పాతవిధానంలోనే ఉండాలన్నారు. ఇండెక్స్ తప్పులను సవరించే అధికారం సబ్ రిజిస్ట్రార్‌కి ఉండే విధంగా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మదనపల్లె దస్తావేజులేఖరుల సంఘం అధ్యక్షులు రంగు గుణశేఖర్, ఉపాధ్యక్షులు ఎం.నాగమునీంద్ర, కరూర్ వెంకటేష్, రంగు రాజేంద్ర, మొగిలి శ్రీరామయ్యగుప్తా, ఇమ్రాన్‌ఖాన్, యూసుఫ్, నూర్ మహమ్మద్ తాహిర్, శ్రీనివాసులునాయుడు, సాయిశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులు, ఉద్యోగులకు అనువుగా బస్సులు నడపాలి



మాట్లాడుతున్న సర్పంచ్ హబీబ్‌బాషా

పీలేరు : విద్యార్థులు, ఉద్యోగులకు అనువుగా బస్సులు నడపాలని సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా అన్నారు. శనివారం ఆర్టీసీ రీజనల్ మేనేజర్‌కు వినతిపత్రం పోస్టల్ ద్వారా పంపించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతి రోజూ పీలేరు - మదనపల్లె మధ్య ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులకు ఉదయం 8 నుంచి 9 గంటల వరకు ఆర్టీసీ బస్సు సర్వీసులు నడపాలన్నారు. తిరుపతి - మదనపల్లె మార్గంలో తిరిగే నాన్ స్టాప్ బస్సులు గతంలో పీలేరులో సింగిల్ స్టాఫ్ ఉండేదన్నారు. ప్రస్తుతం హైవేరోడ్డులో నేరుగా వెళ్లిపోతున్నాయని, తిరిగి పీలేరు ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ నరసింహారెడ్డి, వార్డు మెంబర్లు ఉదయ్‌కుమార్, ఆబిద్ పాల్గొన్నారు.

క్రమశిక్షణ, సేవా భావానికి ప్రతీక స్కౌట్



విద్యార్థులకు స్కౌట్ ప్రవేశ సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న డీవైఈవో లోకేశ్వర్‌రెడ్డి

పీలేరురూరల్ : క్రమశిక్షణ, సేవా భావానికి ప్రతీక స్కౌట్ అని జిల్లా విద్యా శాఖ అధికారి సుబ్రమణ్యం అన్నారు. శనివారం స్థానిక భువన విద్యాలయంలో స్కౌట్స్ అండ్ గేమ్స్ నూతన యూనిట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కౌట్‌తో విద్యార్థుల్లో నైతిక విలువలు, దేశభక్తి పెంపొందించడం లక్ష్యమన్నారు. విద్యార్థులలో శారీరక దారుఢ్యం పెంపొందించడానికి, మానసికంగా బలోపేతం పొందడానికి స్కౌటిజం తోడ్పడుతుందని తెలిపారు. జిల్లా కార్యదర్శి మడితాటి నరసింహారెడ్డి మాట్లాడుతూ అన్ని రకాల ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో స్కౌట్ యూనిట్లను ఏర్పాటు చేయడం తప్పనిసరన్నారు. స్కౌట్ సర్టిఫికెట్ల పొందడం వల్ల విద్యా, ఉద్యోగ అవకాశాల్లో రిజర్వేషన్ సౌకర్యం కలదన్నారు. అనంతరం విద్యార్థులకు ప్రవేశ సర్టిఫికెట్లను డీవైఈవో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మదనపల్లె ఉప విద్యాశాఖ అధికారి లోకేశ్వర్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ కార్యాలయం అసిస్టెంట్ డైరెక్టర్ రవికుమార్, పాఠశాల హెచ్‌ఎం గుణలక్ష్మీ, ఏఎస్‌ఓసీ లక్ష్మీకర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులు ఆత్మస్థైర్యంతో ముందుకు వెళ్లాలి

మదనపల్లె సిటీ: విద్యార్థినులు ఆత్మస్థైర్యంతో ముందుకు వెళ్లాలని ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి అన్నారు. శనివారం కాలేజీలో మొదటి సంవత్సరం ఇంజనీరింగ్ విద్యార్థినులకు సెల్ఫ్ డిఫెన్స్ ప్రొగ్రాం ఫర్ గ్లర్స్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థినులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. కరాటే మాస్టర్ సదాశివ మాట్లాడుతూ ప్రతి విద్యార్థిని తమను తాను కాపాడుకోవడానికి వివిధ రకాల కరాటే నైపుణ్యాలను నేర్చుకోవాలన్నారు. సమాజంలో పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. తమను తాము ఎలా కాపాడుకోవాలో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ పి.రాయుడు, ఉమెన్ ఎంపవర్‌మెంట్ ఆఫీసర్ నళిని, అధ్యాపకులు పాల్గొన్నారు.

22 నుంచి దసరా ఉత్సవాలు ప్రారంభం

మదనపల్లె సిటీ: జిల్లాలోనే అత్యంత పేరుప్రఖ్యాతులుగాంచిన శ్రీ వాసవీ కన్యాకా పరమేశ్వరి ఆలయంలో ఈనెల 22వతేదీ నుంచి దసరా శరన్నవరాత్రులు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పూనగంటి ఓంప్రకాష్ తెలిపారు. శనివారం స్థానిక ఆలయంలో దసరా ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు.ప్రతి రోజు ఉదయం పూజలు,హోమాలు జరుగుతాయన్నారు. ప్రతి రోజు సాయంత్రం అమ్మవారి ప్రత్యేక అలంకరణతో భక్తులకు దర్శనం కల్పిచడం జరుగుతుందన్నారు. 22న శ్రీ అర్ధనాథీశ్వరి దేవి అలంకారం, 23న శ్రీ గాయిత్రీదేవి అలంకారం, 24న శ్రీ మీనాక్షిదేవి అలంకారం, 25న శ్రీ అన్నపూర్ణదేవి అలంకారం, 26న శ్రీ మహాలక్ష్మి అలంకారం, 27న శ్రీ వారాహీ దేవి అలంకారం, 28న భువనేశ్వరిదేవి అలంకారం, 29న శ్రీ సరస్వతిదేవి అలంకారం ,30న శ్రీ మహిషాసురమర్ధిని అలంకారం, అక్టోబర్ 1న శ్రీరాజరాజేశ్వరి అలంకారం, 2న శ్రీధన లక్ష్మి అలంకారం 3న డోలోత్సవం, తోటోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షులు గిరిధర్, కార్యదర్శి సతీష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి దసరా ఉత్సవాలు

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన శ్రీ రెడ్డెమ్మకొండ ఆలయంలో ఈనెల 22 నుంచి వచ్చేనెల 02 తేది వరకు దసరా ఉత్సవాలు11 రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో మంజుల తెలిపారు. 22 తేది బాలత్రిపుర సుందరీదేవి, 23న గాయత్రీదేవి,24న అన్నపూర్ణాదేవి, 25న పార్వతీదేవి, 26న శ్రీమహలక్ష్మీదేవి, 27న లలిత త్రిపురసుందరీదేవి,28న శ్రీ మహచండీ, 29న శ్రీసరస్వతి,30న శ్రీదుర్గాదేవి, అక్టోబర్ 01తేదిన శ్రీమహిషాసుర మర్ధినీ, 02తేదిన శ్రీ రాజరాజేశ్వరీ దేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. ప్రతిరోజు అమ్మవారికి పంచామృతాభిషేకము,సామూహిక కుంకుమార్చాన, మహామంగళహారతి, తీర్థప్రసాద వినియోగం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

రౌద్రాల అంకాలమ్మ ఆలయంలో

పీలేరు రూరల్ : స్థానిక ప్రభుత్వాస్పత్రి ఆవరణలో వెలసివున్న శ్రీశ్రీశ్రీ రౌద్రాల అంకాలమ్మ ఆలయంలో సోమవారం నుంచి దేవి నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయన చైర్మన్ కె. రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతి రోజు ఉదయం అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు ఉంటాయని తెలిపారు.

రేపటి నుంచి ఎల్లమ్మ ఆలయంలో శరన్నవ రాత్రులు

కలికిరి: పట్టణంలో వెలసిన గ్రామదేవత ఎల్లమ్మ ఆలయంలో సోమవారం నుంచి దసరా నవరాత్రులు ఉత్సవాలు జరుగుతాయని ఆలయ ధర్మకర్త రెడ్డివారి అశోక్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఉత్సవాలలో భాగంగా 22న సోమవారం బాలాత్రిపుర సుందరీదేవి అలంకారం, 23న గాయత్రీదేవి, 24న అన్నపూర్ణాదేవి, 25న కాత్యాయనిదేవి, 26న మహలక్ష్మీదేవి, 27న లలితా త్రిపుర సుందరీదేవి. 28న మహచండీ దేవి, 29న సరస్వతీదేవి, 30న దుర్గాదేవి, అక్టోబరు 1న మహిషాసుర మర్దిని దేవి, 2న శ్రీరాజరాజేశ్వరి దేవి అలంకారాలలో ఎల్లమ్మ భక్తులకు దర్శనమిస్తారని ఆయన తెలిపారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని, కృపకు పాత్రులు కావాలని కోరారు.

విద్యాలయాల జోన్‌లో వ్యసనాలకు గుడ్ బై

పోలీసుల హెచ్చరిక



విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ దిలీప్‌కుమార్

కురబలకోట: విద్యార్థి దశ జీవితాన్ని తీర్చిదిద్దే కీలక సమయమని, ఇంజనీరింగ్‌తో పాటు వివిధ కళాశాలల వద్ద వ్యసన పదార్థాల విక్రయించరాదని ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ హెచ్చరించారు. ఉన్నతాధికారులు ఆదేశాలతో శనివారం ఆయన కళాశాల ప్రాంతాల్లో డ్రోన్ ద్వారా విద్యాలయాల పరిసరాలలో యువత కదలికలను పరిశీలించారు. దుకాణాలపై దాడులు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా దుకాణాల్లో గుట్కాలు, సిగరెట్లు ఇతర మత్తు ఆపై వ్యసనానికి గురి చేసే వాటిని విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. వీటితో యువతలో ఆరోగ్య సమస్యలతో పాటు చదువుపై శ్రద్ధాసక్తులు క్రమేణా తగ్గిపోతాయన్నారు. వ్యాపారాల కోసం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాట మాడవద్దన్నారు. కళాశాలల పరిసరాల్లో టొబాకో ఫ్రీ జోన్ గా ప్రకటించామన్నారు. అంతేగాకుండా హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేస్తామన్నారు. తినుబండారాలు అవసరమైన దినసరి వస్తువులు మాత్రమే అమ్మాలన్నారు. రెస్పాన్స్‌బుల్ షాపులుగా దుకాణాలు నిర్వహించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు తప్పవన్నారు. విద్యాలయాల జోన్‌లో వ్యసనాలకు ఇక నుండి ఎంట్రీ లేదని మరోసారి స్పష్టం చేశారు. ఆలస్యంగానైనా పోలీసులు తీసుకున్న ఈ చర్యల పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అనిబిసెంట్ సేవలు మరువలేనివి



అనిబిసెంట్‌కు నివాళులర్పిస్తున్న బీటీ కళాశాల సిబ్బంది

మదనపల్లె రూరల్ : పట్టణంలో బెసెంట్ థియోసఫికల్ కళాశాల(బీటీసీ) స్థాపించి, స్థానికంగా విద్యాభివృద్ధికి కృషిచేసిన అనిబిసెంట్ సేవలు మరువలేనివని బీటీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్.శ్రీదేవి అన్నారు. శనివారం అనిబిసెంట్ వర్ధంతి సందర్భంగా కళాశాలలోని సమావేశ మందిరం, అనిబిసెంట్ సర్కిల్‌లోని విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశంలో విద్యావ్యాప్తికి అనిబిసెంట్ చేసిన కృషి మరువలేనిదన్నారు. హోమ్‌రూల్ ఉద్యమానికి నాయకత్వం వహించి, దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడేందుకు ప్రజలను ప్రేరేపించిన విదేశీవనిత అనిబిసెంట్ అన్నారు. స్థానిక ప్రజల పేదరికం, నిరక్షరాస్యతను చూసి చలించి, వారి కోసం దివ్యజ్ఞాన సమాజం ద్వారా విద్యను వ్యాప్తి చేయడంలో భాగంగా బీటీ కాలేజీని స్థాపించారన్నారు. మదనపల్లె చరిత్ర ఉన్నంతవరకు అనిబిసెంట్ పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. బీటీ కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద తయారు కావాలి

–డీపీఓ రాధమ్మ



సమావేశంలో మాట్లాడుతున్న డీపీఓ రాధమ్మ

కలకడ : ప్రతి పంచాయతీలో చెత్త నుంచి సంపద తయారు కావాలని, అందుకోసమే ప్రత్యేక శిక్షణ ఇచ్చి చెత్త సేకరణపై దృష్టి పెట్టాలని జిల్లా పంచాయతీ అభివృద్ధి అధికారి రాధమ్మ ఆదేశించారు. శనివారం కలకడ సర్పంచ్ ప్యారీజాన్ అధ్యక్షతన కలకడ చెత్తసేకరణ కేంద్రం వద్ద రాయచోటి డివిజన్ పరిధిలోని 10 మండలాల సీఆర్‌పీలకు శిక్షణ ఇచ్చారు. తడిచెత్త సేకరణ వలన ప్రయోజనాలు, పొడిచెత్త సేకరణ వలన ప్రయోజనాలు, ప్లాస్టిక్ నివారణపై అవగాహన, కరగని ఘణపదార్థాల నిల్వ వంటివాటి గురించి డీపీఆర్‌ఓలు అష్రఫ్‌అల్లి, రామ్మోహన్ కమ్యూనిటీ రీసోర్స్‌పర్సన్‌లకు శిక్షణ ఇచ్చారు. సేంద్రీయ ఎరువుల తయారీ, వర్మికంపోస్ట్ ఎరువుకు ఎక్కువగా డిమాండ్ ఉందని గుర్తు చేశారు. ప్రతి పంచాయతీలో శిక్షణ పొందిన సిఆర్‌పీలు గ్రీన్‌అంబాసిడర్‌లు తిరిగి శిక్షణ ఇచ్చి, ప్రతి ఇంటినుంచి చెత్త సేకరణ, సేకరణ చెత్తనుంచి ఎరువుల తయారీ వంటి వాటిపై శ్రద్ధపెట్టాలన్నారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ లక్ష్మీపతి, ఎంపీడీఓ భానుప్రసాద్, డిప్యూటి ఎంపీడీఓ ప్రతాప్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు,జావాద్, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించాలని వినతి



ఆర్టీఓకు వినతిపత్రం అందిస్తున్న బీవైఎస్ పునీత్, తదితరులు

మదనపల్లె రూరల్ : పట్టణంలోని ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించడంతో పాటు రోడ్డుప్రమాదాలను అరికట్టాలని ఆర్టీఓ అశోక్‌ప్రతాప్‌రావుకు, బహుజన యువసేన రాష్ట్ర అధ్యక్షులు పునీత్ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పునీత్ మాట్లాడుతూ...పట్టణంలో ట్రాక్టర్, ఆటో డ్రైవర్లు రోడ్లపై అకస్మాత్తుగా వాహనాలను నిలిపివేస్తుండటంతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రాత్రిపూట ట్రాక్టర్లుకు ఎలాంటి ఇండికేటర్లు, రేడియం స్టికర్లు లేకపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. మైనర్ పిల్లలు బైక్‌లు నడపడం వల్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. వీటన్నంటిపై రవాణాశాఖ అధికారులు దృష్టి సారించి, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో బీవైఎస్ నాయకులు జిలానీబాషా, హరికృష్ణ, సాయికిరణ్, నమాన్‌బాషా, వినీత్, నితీష్, జగదీష్, శశికుమార్ పాల్గొన్నారు.

పేపర్ పబ్లికేషన్స్ కెరీర్‌కు గోల్డ్ పాస్‌పోర్ట్

– విద్యార్థుల ప్రతిభకు అంతర్జాతీయ గుర్తింపు



మాట్లాడుతున్న డాక్టర్ శ్రీదేవి

కురబలకోట: ఇంజనీరింగ్ విద్యార్థుల కెరీర్‌కు పేపర్ పబ్లికేషన్స్ గోల్డ్ పాస్‌పోర్ట్‌లా నిలుస్తాయని తద్వారా అంతర్జాతీయంగా పేరు గుర్తింపు కూడా రాగలదని సీఎస్‌ఈ విభాగాధిపతి శ్రీదేవి అన్నారు. అంగళ్లు మిట్స్ డీమ్డ్ యూనివర్సిటీలో శనివారం జాతీయ స్థాయి ఆర్టికల్ ప్రజెంటేషన్, పేపర్ పబ్లిషింగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మొదటి సంవత్సరం నుండే పరిశోధనలపై దృష్టి సారించాలన్నారు. అంతర్జాతీయ పత్రికల్లో జర్నల్స్ ప్రచురింపబడతాయన్నారు. ఇది ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందన్నారు. ప్రపంచ దృష్టిని కూడా ఆకర్షిస్తుందన్నారు. గేట్, జీఆర్‌ఈ వంటి పోటీ పరీక్షలకు కూడా ఉపకరిస్తుందన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



కలికిరి: మొక్క నాటుతున్న ఉద్యాన పాలిటెక్నిక్ అధ్యాపకులు, విద్యార్థులు



నిమ్మనపల్లె : స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్‌లో భాగంగా మొక్కలు నాటుతున్న అధికారులు

కలికిరి: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని సీహెచ్‌సీ సూపరింటిండెంట్ డాక్టర్ పవన్‌కుమార్, ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులు అన్నారు. గ్రీన్ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక సీహెచ్‌సీ ఆవరణలో ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం విద్యార్థులు నీడనిచ్చే కానుగ, వేప, వాణిజ్య విలువలు కలిగిన వెదురు, మామిడి, నేరేడు, నిమ్మ, సీతాఫలం, ఉసిరి, జామ, చింత మొక్కలతో పాటు అలంకార మొక్కలైన గుల్మొహర్, పెల్టోఫోరం, బౌహినియా తదితర రకాలు మొక్కలు నాటారు. పచ్చదనంతో పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చని, నాటిన మొక్కలను వైద్య సిబ్బంది పరిరక్షించాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

నిమ్మనపల్లె : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ఎంపీడీఓ రమేష్‌బాబు అన్నారు. శనివారం స్వచ్ఛ ఆంధ్ర– స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా మండలపరిషత్ కార్యాలయం నుంచి నిమ్మనపల్లె బస్టాండ్ వరకు విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. అందరిచే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతామని ప్రతిజ్ఞ చేయించారు. మండల పరిషత్ కార్యాలయంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ...వాతావరణ కాలుష్యాన్ని తగ్గించేందుకు పచ్చదనం పెంచాల్సిన అవసరం ఉందన్నారు. అందులో భాగంగా ప్రతి ఒక్కరు ఒక మొక్కను నాటి పరిరక్షించాలన్నారు. ఇంటిపరిసరాల్లో పచ్చదనం పెంపొందించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ బాలరాజు, ఎంఈఓ పద్మావతి, హెచ్ఎం అంజాద్‌బాషా, ఏపీఓ రమేష్, ఏపీఎం మురళీ పాల్గొన్నారు.

పచ్చదనానికి మొక్కల పెంపకం

కురబలకోట: మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా గ్రామాల్లో పచ్చదనం నెలకొంటుందని వైఎస్సార్ సీపీ జిల్లా నాయకులు, అంగళ్లు గ్రామ సర్పంచ్ పోరెడ్డి విశ్వారెడ్డి అన్నారు. శనివారం సచివాలయం వద్ద ఎంపీడీఓ గంగయ్య ఇతర అధికారులతో కలసి మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ పర్యావరణానికి మేలు జరుగుతుందన్నారు. ఆక్సిజన్, గాలి నాణ్యత పెరుగుతుందన్నారు. జీవ వైవిద్యానికి ఆశ్రయంగా ఉంటుందన్నారు. కార్యదర్శి ఉదయకుమార్ పాల్గొన్నారు.